
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 17 జనవరి 2024 | 5



భక్తజన జాతర

కనుల పండువగా జగన్నతోట ప్రభల తీర్థం

కొలువుదీరిన ఏకాదశ రుద్రులు... 7లో



కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో ఏర్పాటుచేసిన మెగా బరిలో కోడి పందాలు తిలకిస్తున్న ప్రజలు





ఆలమూరు మండలం మడికి, రామచంద్రపురం మండలం హసన్‌బాదల్లో బరిలో తలపడుతున్న కోడి పుంజులు



కోట్లాట

పోలీసులు, ప్రజాప్రతినిధుల సాక్షిగా సంక్రాంతి పర్వదినాల ముసుగులో అసాంఘిక శక్తులు పేట్రేగిపోయాయి. కోట్ల రూపాయలు పణంగా పెట్టి కోడిపందాలు, గుండాట, పేకాటలు వంటి జూదాల క్రీడా వినోదంలో లక్షల మంది మునిగి తేలిపోయారు. హైకోర్టుతో పాటు, ఎస్పీ, రెవెన్యూ ఉన్నతాధికారులు పందాల నిర్వహణపై ప్రసార మాధ్యమాల్లో ప్రకటనలు చేసినప్పటికీ నిబంధనలు ఎక్కడా అమలుకాలేదు. సంక్రాంతి జాతరల పేరిట గ్రామీణ ప్రాంతాల్లో గుండాట పేరిట మరో విష సంస్కృతి వ్యాపించింది. పోలీసుల ప్రత్యక్ష ప్రమేయంతోనే జిల్లావ్యాప్తంగా జూదాలు, అశ్లీల నృత్య ప్రదర్శనలు హోరెత్తాయి. పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల జనం లేక పందాలు వెలవెలబోయాయి. మామూళ్ల మత్తులో ఉన్న కొందరు పోలీసు అధికారులు జాతీయ రహదారుల చెంతనే పందాలు, గుండాటల నిర్వహణకు అవకాశం కల్పించిన తీరు చర్చనీయాంశమైంది. ప్రజాప్రతినిధులు రాజ ఠీవితో పందాలను తిలకించి ఆనందపరవశులయ్యారు.

- కోనసీమలో ముగిసిన జూద క్రీడల జాతర
- మూడు రోజులు పేట్రేగిపోయిన అసాంఘిక శక్తులు
- తిరునాళ్లను తలపించే రీతిలో పందెం బరులు, గుండాటలు
- కోడిపందాలు, గుండాటల్లో రూ.వంద కోట్లు పైనే..
- ప్రేక్షక పాత్రలోనే పోలీసు, రెవెన్యూ అధికారులు
- కాసుల వేటలో కొందరు.. కోసల వేటలో మరికొందరు
- పందాలను తిలకించిన అధికార, ప్రతిపక్ష నేతలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సంస్కృతీ, సంప్రదాయాల ముసుగులో వికృత క్రీడా వినోదాలు, జూదాలు, అశ్లీల నృత్య ప్రదర్శనలతో మూడు రోజుల పాటు జరిగిన సంక్రాంతి పర్వదినాలు మంగళవారం ముగిశాయి. మూడు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా జరిగిన కోడిపందాలు, గుండాట, పేకాట పోటీల్లో రూ.వంద కోట్ల పైనే చేతులు మారినట్టు సమాచారం. ముఖ్యంగా కాట్రేనికోన మండలం గెద్దనపల్లి, చెయ్యేరుల్లో ఏర్పాటుచేసిన మెగా బరుల వద్ద రూ.10కోట్లపైనే లావాదేవీలు జరిగినట్టు సమాచారం. నిర్వాహకులు కూడా కోట్లాది రూపాయలను సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిజిటల్ స్క్రీన్ల నడుమ మినీ స్టేడియాలను తలపించే రీతిలో కొన్ని బరులను ఏర్పాటుచేశారు. అధికార వైసీపీకి చెందిన అమాత్యుల నుంచి ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకుల కనుసన్నల్లోనే పందెం బరులు జరిగాయి. కోనసీమలోని వివిధ ప్రాంతాల్లో 50కి పైగా కీలక బరుల్లో కోడిపందాలు, గుండాటలు మూడు రోజుల పాటు హోరెత్తిపోయాయి. పలుచోట్ల రోడ్డుపక్కనే పందెం బరులు ఏర్పాటు చేశారు. అమలాపురం పట్టణంలోని బైపాస్‌లో, రామచంద్రపురం పట్టణంలో మూడు చోట్ల, మండపేటలో ఐదుచోట్ల, మలికపురం మెయిన్‌రోడ్డు పక్కనే కోడి పందాలు, గుండాటలు యథేచ్ఛగా నిర్వహించారు. 216 జాతీయ రహదారిని ఆనుకుని కామనగరువు బైపాస్, కడలి రోడ్డులో శివకోడుతో పాటు అనేకచోట్ల పందెం బరులు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కొన్ని కీలక గుండాట బోర్డుల వద్ద రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు చేతులు మారినట్టు అనధికారిక సమాచారం.

ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో బరుల వద్దకు వెళ్లిన కొందరు మీడియా ప్రతినిధులు డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలపై నిర్వాహకులు దాడులకు తెగబడ్డారు. వేట్లపాలెం, కామనగరువు వద్ద యువకుల మధ్య ఘర్షణ జరిగింది.

పలు బరుల వద్ద ఆర్కెస్ట్రాల ముసుగులో డ్యాన్సులు కూడా నిర్వహించారు. మద్యం ఏరులై పారింది. ప్రభుత్వ షాపుల్లో దొరకాల్సిన మద్యం బరుల వద్ద బహిరంగంగా విక్రయాలు జరిగాయి.

కాగా కోనసీమలోని పోలీసు సిబ్బంది స్టేషన్లకే పరిమితమయ్యారు. ఆయా ప్రాంతాల్లోని పందెంబరుల నిర్వాహకుల నుంచి ముందస్తు ఒప్పందాల నేపథ్యంలో మామూళ్లతో పాటు పందెంపుంజు (కోస)లను కానుకలుగా ఇచ్చారు. స్టేషన్ నుంచి జిల్లా స్థాయి వరకు షరా మామూళ్లే కావడంతో జిల్లావ్యాప్తంగా పందేలు, గుండాటలు, రికార్డింగు డ్యాన్సులు యథేచ్ఛగా సాగాయి. అయితే కొన్నిచోట్ల నిర్వాహకులు మామూళ్లు సమర్పించలేదనే కారణంతో ఆయా పోలీసు స్టేషన్లకు చెందిన సిబ్బంది కోడిపందాలు, గుండాటలు జరగకుండా అడ్డుకున్నట్టు సమాచారం. కాగా కొత్తపేట ప్రభల తీర్థంతో పాటు కరవాక అశ్లీల రికార్డింగు డ్యాన్సులు జోరుగా సాగాయి. పి.గన్నవరం మండలం గంటిపెదపూడిలో వైసీపీకి చెందిన ఓ యువ నాయకుడు పుట్టినరోజును పురస్కరించుకుని భారీ స్థాయిలో డ్యాన్సర్లతో డిజిటల్ స్క్రీన్ల మధ్య రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించారు. అలాగే పలుచోట్ల ప్రభల ఉత్సవాల ముసుగులో డ్యాన్సులు జరిగాయి. కొత్తపేట ప్రభల తీర్థంలో పోలీసులు వారించినప్పటికీ నిర్వాహకులు మొండిపట్టు పట్టడంతో విధిలేని పరిస్థితిలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించాల్సి వచ్చింది. తొలిరోజు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోడిపందాలు, గుండాటలను ప్రారంభించి ఆడారు. ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తన నియోజకవర్గంలో పలుచోట్ల పందెం బరులను ప్రారంభించారు. ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, టీడీపీలో కీలక నేతలైన గంటి హరీష్‌మాధుర్, దాట్ల బుచ్చిబాబులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నేతలు కోడి పందాలను తిలకించారు.



ముమ్మిడివరం మండలం రాజుపాలెంలో గుండాట శిబిరం



ఆలమూరు మండలం మడికిలో కోడి పందాల శిబిరం వద్ద పెద్ద సంఖ్యలో వాహనాలు



పి.గన్నవరం మండలం కుందాలపల్లిలో కొలువుదీరిన ప్రభలు

ప్రభంజనం

చుట్టూ కొబ్బరిచెట్లు... పచ్చని తివాచీ పరుచుకున్నట్టుగా పంట పొలాలు... పిల్ల కాలువలు... వాటి నడుమ కోటి వన్నెలద్దిన హరివిల్లులా మెరిసిన ప్రభలు... సంక్రాంతి పర్వదినాల సందర్భంగా కోనసీమ ఆధ్యాత్మిక సౌరభంతో పులకించింది. నేల అణువణువూ జనావర్ణమే అయింది. కోనసీమ నలుచెరుగులా మహోత్సాహంగా జరిగిన ప్రభల తీర్థంలో పుడమి తల్లి సాక్షిగా కైలాసమే కొలువుదీరినట్టు కనిపించింది ...8వ పేజీలో





మలికిపురం మండలం కేశనపల్లిలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పుంగనూరు గిత్తల బండిపై ఊరేగుతున్న యువకులు (పైన)
కొత్తపేటలో జై శ్రీరామ్.. జయహో అయోధ్య నినాదంతో ప్రభ (కుడి)



మామిడికుదురు శివారు కొర్లగుంటలో ప్రభల తీర్థానికి తరలివచ్చిన ప్రజలు



ముమ్మిడివరం మండలం కొత్తలంక ప్రభలను ఆక్వా చెరువుల్లో నుంచి పల్లిపాలెంలోని తీర్థ స్థలికి తీసుకొస్తున్న దృశ్యం

ఐదేళ్లకోసారే ధరలు పెంచండి

అంగన్‌వాడీల దీక్షా శిబిరంలో వైసీపీ ప్రభుత్వానికి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐవీ రావు చురక

అమలాపురం టౌన్, జనవరి 16: జీతాలు పెంచమని అంగన్‌వాడీలు అడుగుతుంటే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఐదేళ్లకోసారి పెంచుతామంటున్నారని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అంగన్‌వాడీలు ఐదేళ్లకోసారి జీతాలు పెంచమని అడుగుతారు. మీరు కూడా ఐదేళ్లకోసారి మాత్రమే ధరలు పెంచాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె కనుమ రోజైన మంగళవారం 36వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ ఐవీ సందర్శించి మాట్లాడారు. సమ్మె చేస్తున్నా ఇంతవరకు సీఎం జగన్ స్పందించకపోవడం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడానికి కాకుండా సమ్మెను విరమింపజేయడానికి చర్యలు జరుపుతోందని ఆరోపించారు. జూలై నెలలో జీతాలు పెంచుతామని సజ్జల ప్రకటించడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. మీరేమైనా జ్యోతిషం చెప్తున్నారా... మళ్లీ వచ్చేది ఏ ప్రభుత్వమేనని మీకు ముందే తెలుసా అంటూ మండిపడ్డారు. అంగన్‌వాడీల కనీస డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శిబిరాన్ని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శిబిరంలో సంఘ జిల్లా కోశాధికారి పి.అమూల్య, డి.మణికుమారి, ఎస్.శాంతి, కె.పరిపూర్ణ, డి.లక్ష్మి, రజియా, సూర్యావతి, భవానీ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

పిండి వంటలు మీకు... కారం అన్నం మాకా!

ముమ్మిడివరం, జనవరి 16: డిమాండ్ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరుకుంది. ఐసీడీఎస్ ముమ్మిడివరం ప్రాజెక్టు పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సీడీపీవో కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చిత్రపటాల ముందు పలు రకాల పిండి వంటలు పెట్టి వారు మాత్రం అన్నంలో కారం కలుపుకుని తింటూ నిరసన వ్యక్తం చేశారు. పండుగ రోజుల్లో పిండి వంటలు మీకు, కారం అన్నం మాకా అంటూ నినాదాలు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, వెంకటలక్ష్మి, నాగరత్నం, విజయకుమారి, వి.తలుపులమ్మ, వి.మంగాలక్ష్మి, శ్రీదేవి, జి.అనంతలక్ష్మి, ఎం.అరుణ, ఎం.కనకదుర్గ, కె.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అన్నంలో కారం కలుపుకుని తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

భక్తజన జాతర



తరతరాల సంప్రదాయం తళుకులీనింది. కోనసీమలో ప్రభలు ఊరేగాయి. పెద్ద పండగ కోనసీమకు కొత్త అందాలు అద్దింది. నేలతల్లి అభయహస్తాల్లాంటి కొబ్బరి చెట్లతో పోటీ పడుతూ రంగు రంగుల ప్రభలు ముందుకు సాగాయి. అన్నపూర్ణ పరిచిన మహావిస్తరిలాంటి వరి చేలలో వాటి పయనం కనువిందు చేసింది....డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లిశివారు జగ్గన్నతోట ప్రభల తీర్థం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. జగ్గన్నతోట 7 ఎకరాల భూమి భక్తులతో కిక్కిరిసింది.



ఎడ్లబండిపై తీర్థం చూడడానికి..



కొలువుదీరిన ప్రభలు

జన సందోహం | జగ్గన్నతోట ప్రభల తీర్థం

తీర్థంలో కొలువుదీరిన ఏకాదశ రుద్రుల ప్రభలు

ప్రభలు అప్పర్‌కౌశిక దాటే సమయంలో వీక్షించేందుకు పోటెత్తిన భక్తులు

తీర్థంలో భారీ బందోబస్తు

వివిధ రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా వచ్చిన జనం

కిక్కిరిసిన రహదారులు

అంబాజీపేట, జనవరి 16:తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే ఈ తీర్థానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఇరుసుమండ, కె.పెదపూడి, మొసలపల్లి నుంచి జగ్గన్నతోటకు వెళ్లే రోడ్లన్నీ కిటకిటలాడాయి. 450 ఏళ్ల నుంచి ఏకాదశ రుద్రులు కొలువుగా ప్రసిద్ధిగాంచిన జగ్గన్నతోటకు వివిధ గ్రామాల నుంచి 11 ప్రభలు తరలిరావడం సంప్రదాయం. తీర్థానికి వచ్చే ఇతర గ్రామాల ప్రభలకు స్వాగతం పలికే మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి ప్రభల ఉదయం తొమ్మిది గంటలకే తీర్థంలో కొలువుతీరి స్వాగతం పలికింది. కౌశిక అవతలవైపు ఉన్న గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ప్రభ, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలు కౌశిక దాటి తీర్థంలో ప్రవేశించే ఘట్టం చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. శరభ... శరభ.. అశ్శరభ శరభ అంటూ బరువైన ప్రభలను యువకులు అవలీలగా భుజాన కెత్తుకొని భక్తి భావంతో ముందుకు సాగారు. ఉదయం ఎనిమిది గంటలకే ఆయా గ్రామాల్లోని ప్రభలకు ప్రత్యేక పూజలను నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ప్రభలపై కొలువుతీర్చి మేళతాళాలతో తీర్థానికి తీసుకువచ్చారు. చిరతపూడి చిట్టిచెరువు గట్టు, నరేంద్రపురం, అవిడి, రాకూర్తివారిపాలెం ప్రభలు చిరతపూడిలో కొలువుతీరాయి. వాకలగరవు, తొండవరం ప్రభలు తొండవరంలో కొలువుదీరాయి. తొండవరం, వాకలగరువు ప్రభలు ఒకదానికొకటి పోటీపడి చూపరులను కనువిందు చేశాయి.





కొలువుదీరిన ప్రభలు

ట్రాఫిక్ కష్టాలు

ఇరుసుమండ, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, మొసలపల్లి, కె.పెదపూడి రహదారులు వాహనాలతో నిండిపోవడంతో ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

భారీ బందోబస్తు

మొసల్లపల్లి శివారు జగ్గన్నతోటతో పాటు వాకలగరువు, చిరతపూడి ప్రభల ఉత్సవాలకు జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ ఏ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్ఎస్ పార్టీ బలగాలను మోహరించారు.



ఆకర్షణీయంగా ఉన్న ప్రభలు

కొలువుదీరిన ప్రభలు

వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వర స్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి (సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి (తికాగ్ని కాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి (శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి(కాలాగ్ని రుద్రుడు) , వక్కలంక విశ్వేరస్వామి (త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానంత భోగేశ్వర స్వామి (నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు (మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి (సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు) జగ్గన్నతోట ప్రభల తీర్థంలో కొలువుదీరారు.

సంబరాన్ని వీక్షించేందుకు వచ్చిన జనం




అంబరాన్నంటిన సంబరం

కొత్తపేట, జనవరి 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సంక్రాంతి ప్రభల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా విదేశాల్లో స్థిరపడిన ఇక్కడి కుటుంబాల వారు సైతం పండుగకు విచ్చేసి సందడి చేశారు. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వచ్చిన ప్రభలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొలువుదీర్చారు. నాదస్వర మేళాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, డీజే పాటలు ఎంతగానో అలరించాయి. బోడిపాలెం, కొత్త, పాత రామాలయ వీధుల ఉత్సవదారుల ఆధ్వర్యంలో పోటాపోటీగా జరిగిన బాణసంచా కాల్పులు చూపరులను కట్టిపడేశాయి. ప్రభలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లక్షలాదిగా తరలివచ్చిన వారితో కొత్తపేటలోని ముఖ్య కూడళ్లన్నీ జనసంద్రంగా మారాయి. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాణసంచా కాల్పులు



ఆకట్టుకున్న స్వర్ణప్రభ



కొత్తపేట, జనవరి 16: కొత్తపేట శ్రీవిద్య జ్యువెలర్స్ మణి అనే స్వర్ణకారుడితో మూడు గ్రాముల బంగారంతో తయారు చేయించిన లక్ష్మీగణపతి ప్రభ అందరినీ ఆకట్టుకుంది. సంక్రాంతి ఉత్సవానికి వచ్చిన వారు దీనిని చూసేందుకు ఎగబడ్డారు.

మకరజ్యోతి దర్శనం



ఆభరణాలను తీసుకువస్తున్న దృశ్యం

మండపేట, జనవరి 16: ఆంధ్రా శబరిమలైగా పిలిచే బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శన ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ఎ.ఎల్ కనకరాజు సారథ్యంలో సోమవారం గురుస్వామి స్వగృహం నుంచి స్వామివారి ఆభరణాలను రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన కర్రి ఆదినారాయణరెడ్డి శిరస్సున ధరించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, ఇరుముడుల సమర్పణ జరిగింది. సాయంత్రం బాణసంచా కాల్పులు, మేళతాళాల నడుమ మకరజ్యోతి దర్శనం జరిగింది. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు స్వాములకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రత్నగిరిపై ప్రభల ఉత్సవం

అన్నవరం, జనవరి 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం ప్రభల ఉత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం 7గంటలకు స్వామి, అమ్మవార్లను కొండపై నుంచి పల్లకిలో బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ కొండదిగువ చినరావిచెట్టు పుర గిరి క్షత్రియుల రామాలయం వద్దకు తీసుకునివచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రభపై స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఈవోలు కృష్ణారావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు. సత్యదేవుడి గోశాలలో మంగళవారం సాయంత్రం గోపూజోత్సవం నిర్వహించారు. ఈవో రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కనుమ పండుగ రోజున గోపూజ నిర్వహించడం ద్వారా పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని పండితులు పేర్కొన్నారు.





ఎడ్లబండ్ల వేషాలు

చేబ్రోలులో దేవతామూర్తుల వేషధారణల ప్రదర్శన

ఆకట్టుకున్న కళాకారులు

గొల్లప్రోలు రూరల్, జనవరి 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఎడ్లబండ్లపై వేషధారణలతో గ్రామమంతా ప్రదర్శన నిర్వహించారు. శ్రీకృష్ణ వేషధారణలు, వివిధ దేవ తాలంకారాలతో జరిపిన ప్రదర్శన ఆకట్టుకొంది. నరకాసుర సంహారం తదితర అంశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రతీ ఏటా సంక్రాంతి సందర్భంగా ఇక్కడ బండ్ల వేషాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కళాకారులు వేషాలు వేయడంతో తిలకించేందుకు వీధుల్లోకి భారీగా తరలివచ్చారు. రాత్రంతా బండ్ల వేషాలు కొనసాగాయి. వీటిని తిలకించేందుకు ఇతర గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడం విశేషం. బండ్ల వేషాలతో గ్రామమంతా సందడి నెలకొంది.

తదుపరి సినిమా ప్రభాస్‌తో..డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా



అంతర్వేది, జనవరి 16: స్టార్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా మంగళవారం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది విచ్చేశారు. ముందుగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామిని స్నేహితులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నాచెల్లెల గట్టు, బీచ్, లైట్‌హౌస్ పరిసర ప్రాంతాలను సందర్శించారు. బీచ్ వద్ద ఆయన్ను తదుపరి సినిమా ఎవరితో అని అడగ్గా ప్రభాస్‌తో భారీ ప్రాజెక్టు చేయనున్నట్టు చెప్పారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తానన్నారు. ఇటీవల యానిమల్ సినిమా సూపర్ హిట్ అయిందని, దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ ఖాళీ సమయంలో ఇలా పుణ్యక్షేత్రాలు దర్శనం, విహార యాత్రలు చేస్తుంటానన్నారు. కోనసీమలో జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్నానని, ఇంతటి చక్కటి అందమైన వాతావరణం మనసుకు ఎంతో ఆహ్లాదాన్నిచ్చిందని సందీప్‌రెడ్డి వంగా చెప్పారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

పురుషుల విభాగంలో హైదరాబాద్, మహిళల విభాగంలో ఛత్తీస్‌గఢ్ జట్లు విజేతలు



విజేతలతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

రామచంద్రపురం, జనవరి 16: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 12 నుంచి 15 వరకు జరిగిన 13వ ఆలిండియా, 19వ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పురుషుల విభాగంలో సెయింట్ ఆర్టిలేరి (హైదరాబాద్), మహిళల విభాగంలో బిలాయ్ స్టీల్స్ (ఛత్తీస్‌గడ్) జట్లు విజేతలుగా నిలిచాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ మంగళవారం వివరాలు వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఫైనల్ పోటీల్లో విజేతగా పురుషుల విభాగంలో ప్రథమ స్థానం హైదరాబాద్‌కు చెందిన సెయింట్ ఆర్టిలేరి, ద్వితీయ స్థానం కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (హైదరాబాద్), తృతీయ స్థానం రామచంద్రపురం జట్టు, నాలుగో స్థానం హైదరాబాద్ డీబీఏ జట్టు కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో మొదటి స్థానం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిలాయ్ స్టీల్స్ జట్టు, ద్వితీయ స్థానం రామచంద్రపురం మహిళా జట్టు, మూడో స్థానం హైదరాబాద్‌కు చెందిన డిఫెన్స్ జట్టు, నాలుగో స్థానం ఏలూరు జట్టు నిలిచాయి. కాకినాడ సత్య స్కాన్ సెంటర్ అధినేత కాదా వెంకటరమణ, డాక్టర్ సి.స్టాలిన్, గన్నమని చక్రవర్తి, ఆర్టోస్ ఎండీ అడ్డూరి సంతోష్ వర్మ, డాక్టర్లు సి. రామారావు, సి.కవిత, డాక్టర్ కె.వి.ఎస్.సతీష్, అసోసియేషన్ సభ్యులు విజేత జట్లకు బహుమతులు అందించారు.

కోస మాంసం డిమాండే వేరు

కోడి ధర రూ.6 వేలు వరకు పలుకుతున్న వైనం

సామర్లకోట, జనవరి 16: కోడి పందాలలో ఓడిన కోడి మాంసాన్ని కోస మాంసం అంటారు. ఈ మాంసానికి ఆయా కోడి పందాల బరుల వద్ద ఎంతగానో డిమాండ్ ఉంటుంది. ఆయా కోడి పందాల వద్దే పందాలలో ఓడిన కోడిని వెంట్రుకలు కాల్చి, ముక్కలుగా కొట్టి కోసమాంసంగా తయారుచేసే పనివారు సైతం అందుబాటులోనే ఉంటారు. పందాలలో ఓడిన కోస కోడిపుంజు రెండు కిలోల బరువు వుంటే దాని ధర రూ. 6 వేలు ఉంటుంది. ఇక మాంసం కొట్టేందుకు ఒక్కొక్కదానికి రూ. 200 వసూలు చేస్తున్నారు. పందాలు మండలంలోని మూడు ప్రధాన గ్రామాలలో భారీ పందాలు, అయిదు చిన్న గ్రామాలలో చిన్న మాదిరి పందాలలో సుమారు 400 కోసలు సేకరించి బహుమతులుగా పంపారు. మండలంలోని ఒక ప్రధాన గ్రామంలో సుమారు 140 కోసల మాంసాలను రాజకీయ నాయకులకు, అధికారులకు, పోలీసులకు నజ రానాలుగా పంపినట్లు సమాచారం. పందాలలో పాల్గొనే కోడిపుంజులను పండుగ రోజులకు సుమారు మూడు నెలల ముందునుంచీ బాదంపప్పు, పిస్తాపప్పు, గుడ్లు, జీడిపప్పు, బలవర్ధక మాత్రలు తదితర అధిక పోషక విలువలు ఉండే ఆహారాన్ని పెడతారనే ప్రచారం ఉండడంతో పండుగ రోజులలో కోసమాంసం రుచులను ఆస్వాదించేందుకు ప్రతీఒక్కరూ ఆసక్తి కనబరుస్తారు.

మంత్రి రాజా, ఎమ్మెల్సీ కుడుపూడి వేధిస్తున్నారు

న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం

బాధితురాలు రాజులపూడి ఆరుద్ర

సర్పవరం జంక్షన్, జనవరి 16: అనారోగ్యంతో బాధపడుతున్న దివ్యాంగురాలైన కుమార్తెకు వైద్యం చేయించేందుకు సొంత స్థలం విక్రయంలో మంత్రి దాడిశెట్టి రాజా గన్‌మెన్ అడ్డుతగులుతున్నాడు. న్యాయం కోసం సీఎంవోకు వెళ్లినా న్యాయం జరగలేదు. ఏపీలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. దివ్యాంగురాలికి రక్షణ, న్యాయం కల్పించలేని ప్రభుత్వం న్యాయం కోసం వెళితే పిచ్చాసుపత్రిలో చేర్పించారు. మంత్రి రాజా, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ వేధింపులకు పాల్పడుతున్నారు. పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో వచ్చి స్టేట్‌మెంట్లు అంటూ వేధిస్తున్నారు. గత్యంతరం లేక కాశీకి వచ్చి తలదాచుకుంటున్నాను' అంటూ కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు రాయుడుపాలెంకు చెందిన బాధితురాలు రాజులపూడి ఆరుద్ర మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. దివ్యాంగురాలైన తన కుమార్తె సాయిలక్ష్మీచంద్ర వెన్నుముక సమస్యతో బాధపడుతోందని ఇల్లు అమ్మి వైద్యం చేయించాలని చూస్తే మంత్రి దాడిశెట్టి రాజా గన్‌మెన్ అడుగడుగునా అడ్డుతగిలి ఇబ్బందులు సృష్టిస్తున్నాడని వాపోయారు. నవంబరు 2023లో సీఎంని కలిసేందుకు ప్రయత్నించినా కుదరకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించానని చెప్పారు. న్యాయం కోసం పోరాడితే పోలీసులతో అధికారులు బలవంతంగా పిచ్చాసుపత్రిలో చేర్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం కోసం చంద్రబాబు, పవన్ డీజీపీకి లేఖ రాశానని చెప్పారు. అయినా న్యాయం జరగలేదన్నారు. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని చెప్పారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు



స్వామివారిని దర్శించుకున్న చక్రవర్తి కుటుంబం

అన్నవరం, జనవరి 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.ఎల్.ఎన్ చక్రవర్తి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ముమ్మిడివరం, జనవరి 16: ముమ్మిడివరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి చదువుకున్న స్నేహితుల్లో రెడ్డి మల్లి కార్జునరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు.స్నేహితులు రూ.50వేలు నగదు, దుస్తులను సంక్రాంతి సందర్భంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వి.ఫణి, ఎస్. అజయ్, ఎన్.సత్యనారాయణరాజు, రామ్మోహన్, డి.శ్రీమన్నారాయణ, ఆర్.నాగార్జున, ఎస్.వాసు, డి.త్రినాథులు, టి.నరసింహారావు, ఎస్.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● పంట పొలాలు, కాలువలు దాటించిన ప్రభలు
● ప్రభలకు పూజలు చేసిన భక్తులు
● గ్రామాల్లో ప్రభల సందడి

వైభవంగా ప్రభల తీర్థం



అయినవిల్లి: ముక్తేశ్వరం సెంటర్‌లో ప్రభల తీర్థం

ముమ్మిడివరం, జనవరి 16: కనుమ పండుగనాడు ప్రభల తీర్థం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రాచీన సంస్కృతి సంప్రదాయాల మేళవింపుతో ఆయా గ్రామాల్లో దేవతా మూర్తులను ప్రభలపై ఊరేగించి భక్తి భావాలను చాటుకున్నారు. పల్లిపాలెంలో జరిగే ప్రభల తీర్థానికి ఒక ప్రత్యేకత ఉంది. కొమానపల్లి, కొత్తలంక, ముమ్మిడివరం గ్రామాల తల్లి ప్రభలను ఆయా గ్రామాల నుంచి బ్యాండు మేళాలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులతో యువకుల నృత్యాలతో ఊరేగింపుగా పల్లిపాలెంలోని తీర్థస్థలికి తీసుకువచ్చారు. ముమ్మిడివరం, అగ్రహారం, చింతనలంక, వడ్డిగూడెం, పదో మైలురాయి, రాజుపాలెం గ్రామాల ఉత్సవ ప్రభలను పంటపొలాలు, మురుగునీటి పంటకాల్వలను దాటుకుని తీర్థస్థలికి తీసుకువచ్చారు. పల్లిపాలెంలోని తీర్థ స్థలికి తొలుత వచ్చిన ప్రభ, ఆ తరువాత వచ్చిన ప్రభలకు స్వాగతం పలుకుతూ ప్రభలు వచ్చిన తరువాత ప్రభను నిర్దిష్ట ప్రదేశం నుంచే పైకి అన్ని ప్రభలకు స్వాగతం పలికారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పెన్మెత్స జగ్గప్పరాజు, పెన్మెత్స చిట్టిరాజు, నాయకులు శివన్నారాయణతో పలువురు పల్లిపాలెం తీర్థ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు సమీక్షించారు. మండలంలో అన్నంపల్లి, క్రాపచింతలపూడి, అయినాపురం గ్రామాల్లో కూడా ప్రభల తీర్థం ఘనంగా జరిగింది. ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య, ట్రైనీ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, ఎస్ఐ ఎస్ శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అల్లవరం: తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మణేశ్వరం శివాలయం వద్ద ప్రభల తీర్థం జరిగింది. కొమరగిరిపట్నం, మొగళ్లమూరి నుంచి అలంకరించిన నాలుగు ప్రభలను బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా లక్ష్మణేశ్వరం తీసుకువచ్చారు. అక్కడి పార్వతీ లక్ష్మణేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రభలకు భక్తులు పూజలు చేశారు. భక్తులు ప్రభలతో పాటు లక్ష్మణేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

కొత్తపేట: మండపల్లి, అవిడి డాన్ సెంటర్ వద్ద ప్రభల ఉత్సవాలు జరిగాయి. ఉత్సవ కమిటీల నిర్వాహకులు ప్రభలను అందంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ప్రభలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి.

రావులపాలెం: ఈతకోట, దేవరపల్లి, కేతారాజుపల్లి, వెదిరేశ్వరం గ్రామాలనుంచి ప్రభలు దేవరపల్లి జడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణానికి చేరుకున్నాయి. అక్కడ తీర్థం నిర్వహించారు. రాత్రికి ప్రభలకు బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాల నడుమ గ్రామోత్సవాలు జరిపారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి, విలసవిల్లి, భట్నపాలెం, సన్నవిల్లి, వాడపర్రు, నంగవరం గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో ప్రభలను పోటాపోటీగా ఊరేగించారు. ప్రభలతీర్థాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని పూజలు చేశారు. కనుమ సందర్భంగా గ్రామాల్లో పశువులను పూజించి వేడుకలు జరుపుకున్నారు విలసవిల్లిలో ఎడ్ల బండ్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

అమలాపురం టౌన్/రూరల్: పట్టణంలోని వంటెద్దువారి వీధిలో శ్రీగణపతి, శ్రీగనికమ్మ అమ్మవారి ప్రభల తీర్థ మహోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభలను ఊరేగింపుగా వంటెద్దువారి వీధికి తీసుకువచ్చారు. ఊరేగింపులో ఈదరపల్లి ప్రభలు, శ్రీశేషశయన, శ్రీగనికమ్మ, శ్రీకనకదుర్గ, శ్రీమెట్ల కాలనీ ప్రభలు పాల్గొన్నాయి. మండల పరిధిలోని భట్నవిల్లి, గున్నేపల్లి అగ్రహారం, సాకుర్రు, బండారులంక, నడిపూడి తదితర గ్రామాల్లో ప్రభల ఊరేగింపులు, తీర్థాలు నిర్వహించారు. నడిపూడిలో అన్నపూర్ణా సహిత విశ్వేశ్వరస్వామి ప్రభ ఉత్సవాన్ని కేరళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి తదితరులు పాల్గొన్నారు.







పి.గన్నవరం: కుందాలపల్లిలో ప్రభను కాలువ దాటిస్తున్న దృశ్యం, రావులపాలెం: దేవరపల్లిలోని జడ్పీ క్రీడాప్రాంగణానికి చేరుకున్న ప్రభలు, అల్లవరం మండలం లక్ష్మణేశ్వరంలో కొలువుదీరిన ప్రభలు

అయినవిల్లి: మండలంలో ప్రభల తీర్థం వైభవంగా నిర్వహించారు. ప్రభలను ప్రత్యేకంగా అలంకరించి దేవతమూర్తుల చిత్రపటాలకు ఊరేగింపు నిర్వహించారు. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ప్రభ, ఆంజనేయస్వామి ప్రభ, మడుపల్లి, వెలవెలపల్లి, సిరిపల్లి, విలస, తొత్తరమూడి ప్రభలను ముక్తేశ్వరంలోని ముక్తికాంత క్షణముక్తేశ్వరస్వామిఆలయం వద్దకు తీసుకువచ్చారు. ముక్తేశ్వరం సెంటర్‌లో ప్రభలకు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రభలను దర్శించుకుని పూజలు చేశారు. వీరవల్లిపాలెం, శానపల్లిలంక గ్రామాల్లో ప్రభల ఉత్సవం నిర్వహించారు.

మామిడికుదురు: కనుమ పండుగ రోజున మామిడికుదురు కొర్లగుంటలో ప్రభల తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. మామిడికుదురు పాశర్లపూడి, నగరం, పెదపట్నం, ఈదరాడ గ్రామాల నుంచి భక్తులు భారీ ఊరేగింపుతో బాణంచా కాల్పులు, తీన్‌మార్ డప్పుల నడుమ కొర్లగుంటలోని తీర్థ స్థలికి తీసుకువచ్చారు. పెదపట్నంలోని ఏడు ప్రభలు మోకాలు లోతు నీటిలో భుజాలపై ఎత్తుకుని మోసుకువచ్చే సన్నివేశాన్ని భక్తులు తిలకించి పులకించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రభలను దర్శించుకున్నారు.

పి.గన్నవరం: కోనసీమ వాసులు ఈశ్వరుని ప్రతిరూపంగా భావించే చారిత్రాత్మకమైన ప్రభలు పచ్చని పంటపొలాలు, పంటకాలువలను దాటుకుని ఒక చోట కొలువు తీరి భక్తులకు దర్శనమిచ్చాయి. కనుమ సందర్భంగా మండలంలో పలు చోట్ల ప్రభల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. యువత కేరింతలు, బ్యాండు మేళాలు, బాణసంచా కాల్పులు మధ్య ప్రభలను ఆయా గ్రామాల పురవీధుల్లో ఊరేగించారు. అంబాజీపేట మండలం చిరతపూడి, కొత్తపేట మండలం అవిడి, మోడేకుర్రు, పి.గన్నవరం మండలం నరేంద్రపురం, కుందాలపల్లి గ్రామాలకు చెందిన 40 ప్రభలు ప్రత్యేక పూజలు అనంతరం ఆయా గ్రామాలు నుంచి ఊరేగింపుగా 2కిలోమీటర్లు మేర పంటపొలాలు, పంటకాలువలు దాటుకుని కుందాలపల్లి డ్యామ్ సెంటర్‌కు చేరుకుని కొలువుతీరాయి. అలాగే ముంగండపాలెం శివారు గాజులగుంట ప్రభలదిబ్బకు ఊలిశెట్టివారిపాలెం, కారుపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రభలు కొలువుతీరాయి. అలాగే నాగుల్లంక, మానేపల్లి, ముంగండ గ్రామాల్లో ప్రభల తీర్థమహోత్సవాలు ఘనంగా జరిగాయి. నాగుల్లంకలో వివిధ దేవుళ్ల చిత్రాలతో ఏర్పాటు చేసిన ప్రభలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కుందాలపల్లిలో అవిడి గ్రామస్తులు ఏర్పాటుచేసిన ప్రభలు వెనుక భాగంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చిత్రాలతో పాటు ఒకప్రభ ముందు భాగంలో జనసేనాని అని ఏర్పాటు చేసిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వగ్రామం నరేంద్రపురం విచ్చేసిన ఇంటిలిజెన్స్ ఎస్పీ భుసారపు ఏసుబాబు శ్రీబాలాత్రిపురసందరి సమేత మల్లేశ్వరస్వామి ప్రభను దర్శించుకున్నారు.

రాజోలు: కనుమ పండుగనాడు ప్రభల తీర్థాలు ఘనంగా నిర్వహించారు. తాటిపాకలో అమ్మవారి ఆలయం వద్ద శివకోటిలో శ్రీపుంతలో ముసలమ్మ ఆలయం వద్ద తీర్థాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్ల ఆలయం వద్ద క్యూలో నిలబడి దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు పర్యవేక్షణలో ఎస్ఐ జి.పృథ్వీ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన



పి.గన్నవరం, జనవరి 16: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు సంక్రాంతి రోజు పిండివంటలు చేసుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కనుమ రోజు చిన్నచిన్న ప్రభలు చేతపట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా యూనియన్ అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రామచంద్రపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు 36వ రోజు దీక్షను ప్రారంభించారు. కె.గంగవరం, రామచంద్రపురం ప్రాజెక్టులకు చెందిన 300మంది అంగన్వాడీలు దీక్షలో పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణలో భాగంగా సంతకాలు సేకరించారు.

ఘనంగా సంక్రాంతి పండుగ

కె.గంగవరం, జనవరి 16: మండల ప్రజలు సోమవారం సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, దంగేరు, మసకపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పేకేరు, యండగండి తదితర గ్రామాల్లో రంగవల్లుల పోటీలు నిర్వహించారు.

మలికిపురం: తూర్పుపాలెంలో ప్రభల తీర్థం సందర్భంగా ప్రభల ఊరేగింపు జరిగింది. కేశనపల్లిలో నీలపళ్లమ్మ తీర్థం సందర్భంగా గ్రామస్తులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పుంగనూరు గిత్తల బండిపై, గుర్రాలపై ఊరేగారు. అన్ని గ్రామాల్లో కోడిపందాలు, గుండాటలు జరిగాయి.

ఆత్రేయపురం: సంక్రాంతి వేళ ఇళ్లన్నీ బంధుమిత్రులతో కళకళలాడాయి. వెలిచేరు శివారు ఊదలమ్మ అమ్మవారి తీర్థం జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ర్యాలి అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం వైభవంగా జరిగింది.

ఘనంగా గ్రామోత్సవం

అంతర్వేది, జనవరి 16: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కనుమ నాడు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. సంక్రాంతి కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయమంతా కిటకిటలాడింది. 15వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. సాయంత్రం స్వామివారికి గరుడ పుష్ప వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

ఒకే అరటి ఆకులో కుటుంబ భోజనం



ఆలమూరు, జనవరి 16: సంక్రాంతి అంటేనే గోదావరి జిల్లా వాసుల ప్రత్యేకత ఉంటుంది. దేశ, విదేశాల నుంచి స్వగ్రామాలకు వచ్చి పండుగను ఆనందోత్సాహలతో జరుపుకుంటుంటారు. పెదపళ్లలో ఉపాధ్యాయుడు ఉడతా వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు పెద్ద అరటి ఆకులో సహపంక్తి భోజనం చేసి గోదారోళ్ల ప్రత్యేకతను చాటుకున్నారు.

తగలబడ్డ 104 అంబులెన్సు వాహనం



అమలాపురం టౌన్, జనవరి 16: కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న జీఎంసీ బాలయోగి స్టేడియం ఎదుట ప్రధాన రహదారిని ఆను కుని ఏళ్ల తరబడి మూలన పడి ఉన్న 104 అంబులెన్సు వాహనం మంగళవారం అగ్నికి ఆహుతైంది. విద్యుత్ తీగలు తెగి పడడంతో వాహనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపిం చాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉండగా వచ్చిన 104వాహనాల్లో ఇది ఒకటి. ఇలా రోడ్డు పక్కన ఎన్నో వాహనాలు మూలన పడి ఉన్నాయి. రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు తెలిపారు.

ప్రభల వెనుక పవన్..



అమలాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమలో మంగళవారం జరిగిన ప్రభల ఉత్సవాల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఫొటోలు ఆకట్టుకున్నాయి. జగ్గన్నతోట, కొత్తపేట, కొర్లగుంట సహా అనేక ప్రాంతాల్లో జరిగిన ప్రభల తీర్థాల్లో ప్రభల వెనుక భాగంలో పవన్‌కల్యాణ్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు చూపరులను అలరించాయి.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు, జనవరి 15: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదానానికి పలువురు దాతలు విరాళాలు అందించారు. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి శ్రీనివాస్, స్వప్న దంపతులు రూ.25వేలు, హైదరాబాద్‌కు చెందిన కాశీభొట్ల నరసింహమూర్తి-శుద్ధరాణి దంపతులు రూ.10,116, పరంశెట్టి మురళీకృష్ణ జ్ఞాపకార్థం పరంశెట్టి శివ రూ.10,116, అప్పనపల్లికి చెందిన గుబ్బల వీర వెంకటసత్యనారాయణ-గంగవతి జ్ఞాపకార్థం వారి మనుమడు రూ.15వేలు అందించారు.

సంప్రదాయాలకు నెలవు పేరంటాలమ్మ తీర్థం



కె.గంగవరం: సత్యవాడలో జాతర సందర్భంగా గరగనృత్యాలు

ఆలమూరు, జనవరి 16: అంతరించిపోతున్న కావిళ్లను నేటి తరానికి పరిచయం చేస్తున్నారు జొన్నాడవాసులు. ఇక్కడ గోదావరి ఏటిగట్టును ఆనుకుని వున్న పేరంటాలమ్మ తల్లి ఆలయం వద్ద ప్రతిఏటా సంక్రాంతి రోజున తీర్థం నిర్వహిస్తారు. ఈ ఏడు కూడా అదే మాదిరిగి తీర్థం జరిపారు. గ్రామానికి చెందిన వందలాది మంది భక్తులు కావిళ్లతో పానకం, పిండి వంటలు, చీర-జాకెట్టు, పసుపు-కుంకుమలను మేళతాళలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలమూరు గ్రామదేవత రావులమ్మ అమ్మవారి జాతర, తీర్థం సోమ, మంగళవారాల్లో ఘనం గా జరిగాయి. గరగ నృత్యాలు, చర్మవాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా అలరించాయి. పెదపళ్ల పోలేరమ్మ, గుమ్మిలేరు ఉరదాలమ్మ, మడికి పోలేరమ్మ జాతరలు వైభవంగా జరిగాయి. పలువురు నాయకులు, అధిక సంఖ్యలో ప్రజలు అమ్మవార్లను దర్శించుకున్నారు.

సత్యవాడలో ధనమ్మతల్లి జాతర

కె.గంగవరం, జనవరి 16: సత్యవాడలో ధనమ్మతల్లి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, గరగనృత్యాలు, శక్తివేషధారణలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా పాపమ్మవారి జాతర

కె.గంగవరం, జనవరి 16: దంగేరులోని ఓబిళినేనివారి పాపమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతరకు కుడుపూరు, శివల, దంగేరు తదితర గ్రామాల నుంచి ప్రజలు ప్రభలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారి ఆలయం వద్ద ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గనిపోతురాజు జాతర ఉత్సవాలు ప్రారంభం

మండపేట, జనవరి 16: కేశవరంలో శ్రీగనిపోతురాజు స్వామివారి జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు ఈనెల31వరకు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజనగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దర్శించుకుని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, పార్టీ నేతలు దూలం వెంకన్నబాబు, ఎంపీపీ ఉండమట్ల వాసు వారికి స్వాగతం పలికారు. ఏడిదలో వేంచేసియున్న చింతాలమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మండపేట ఏడిదరోడ్డులో ఉన్న శ్రీపేరంటాళ్లమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామదేవతగా కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా భక్తులు ప్రగాఢ విశ్వాసం. కొప్పిరెడ్డి వారి ఆడపడుచు పేరంటాళ్లమ్మకు కుటుంబసభ్యులు కావిళ్లతో సారి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు

పసలపూడిలో ఘనంగా వెంపర్తమ్మ జాతర

రాయవరం, జనవరి 16: పసలపూడిలో వెంపర్తమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు, పసుపు, కుంకుమ, సారే, చీరలు, గాజులు, నైవైద్యం సమర్పించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారికి గ్రామంలో భక్తులు గ్రామోత్సవం జరిపారు. ఈసందర్భంగా నిర్వాహకులు భారీ అన్న సమారాధన నిర్వహించారు.

అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభం

అంతర్వేది, జనవరి 16: అంతర్వేది, కేశవదాసు గ్రామాల్లో వెలసి ఉన్న శ్రీకనకముత్యాలమ్మ, కనకదుర్గమ్మ, మారమ్మ అమ్మవార్ల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పండుగ మూడు రోజులు అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అంతర్వేది కొత్తపేటలో ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఛైర్మన్ లక్కు సత్యనారాయణ తెలిపారు.

అలరించిన సంక్రాంతి సంబరాలు



అమలాపురంలో ఎన్టీఆర్ నగర్‌లో ప్రభల ఉత్సవంలో పాల్గొన్న నందెపు బాలాజీ, విజయలక్ష్మి దంపతులు

అమలాపురం టౌన్, జనవరి 16: మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ)-విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ నగర్‌లోని నందెపు ఎన్‌క్లేవ్ వద్ద మంగళవారం కనుమరోజున నిర్వహించిన ప్రభల ఊరేగింపు కనుల పండువగా జరిగింది. మహిళలకు, యువతులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గరగ నృత్యాలు, దాండియా, గారడీలు, తీన్‌మార్ డప్పులు, కనులు మిరు మిట్లు గొలిపే భారీ బాణసంచా కాల్పులు జరిపారు. మంత్రి పినిపే విశ్వ రూప్, మాజీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, చిల్లా జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, బాలాజీ కుటుంబ సభ్యులైన మెట్రోకెమ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎన్.హర్షవర్ధన్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ ఎన్.హరదేవ్, డిజిటల్ మార్కెటింగ్ హెడ్ ఎన్.యజ్ఞసరోజ, స్నేహిత, గంధం పల్లంరాజు, అడపా వెంకటేశ్వరరావు (బాబ్జీ), మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం

మలికిపురం, జనవరి 16: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై స్కిల్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పాక్షిక విజయమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సుప్రీం కోర్టులో పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. చంద్రబాబువైపే న్యాయం ఉందని, భవిష్యత్తులో అది తేలుతుందని గొల్లపల్లి అన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	గుంటూరు కారం
వెంకటరమణ	సైంధవ్
శ్రీలలిత	గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	నాసామిరంగ
రమా	గుంటూరు కారం
గణపతి	నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	సలార్

రా.. కదిలిరా.. సభలకు విశేష స్పందన

అంతర్వేది, జనవరి 16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటున్న రా.. కదిరిలా.. సభకు విశేష ఆదరణ లభిస్తోందని మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, గొల్లపల్లి సూర్యారావు అన్నారు. రాజోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా మాజీ మంత్రి పితాని ముందుగా సఖినేటిపల్లి మూడు తూముల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నాయకులు, ఆచంట నియోజకవర్గ పరిశీలకుడు రుద్రరాజు వెంకట్రామరాజు ఇంటి వద్ద జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో పితాని పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీమంత్రులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగి పోయారన్నారు. అన్నివర్గాలు సర్వనాశనమైపోయారని, బడుగు బలహీనవర్గాలపై వైసీపీ పాలనలో అడ్డు అదుపు లేకుండా దాడులు జరిగాయన్నారు. బలహీనవర్గాలకు 34శాతం ఉన్న రిజర్వేషన్లు 24శాతానికి కుదిస్తే కనీసం న్యాయపోరాటం చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పిండి సత్యనారాయణ, రుద్రరాజు రాజా, కుడుపూడి సత్తిబాబు, కొల్లాబత్తుల కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యానాం బీచ్‌లో పర్యాటకుల సందడి

యానాం, జనవరి 16: రాజీవ్‌గాంధీ బీచ్‌లో సంక్రాంతి నేపథ్యంలో అధిక సంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు. యానాం పర్యాటకశాఖ ఆధీనంలోని సీగల్స్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బోటింగ్ ద్వారా వృద్ధగౌతమి గోదావరి నదిలో బోటు షికారు చేశారు. బొటానికల్ గార్డెన్‌లో కూడా పర్యాటకులు సందడి చేశారు. బీచ్‌లోఉన్న జీసస్‌మౌంట్, భారతమాత విగ్రహం, రాజీవ్‌గాంధీ పార్కు, శివంహోలీబాత్‌లను పర్యాటకులు సందర్శించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

ద్విచక్ర వాహనాలపైకి దూసుకుపోయిన ఆటో

ఉప్పలగుప్తం, జనవరి 16: ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం ఒక ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలపైకి దూసుకుపోయింది. ఐదుగురికి గాయాలు కాగా అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నకారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్తున్నారు. ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రభల తీర్థంలో వ్యాపారి మృతి

ముమ్మిడివరం, జనవరి 16: పల్లిపాలెంలో మంగళవారం జరిగిన ప్రభల తీర్థంలో ఖర్జూర పండు వ్యాపారస్తుడు అస్వస్థతకు గురై మృతి చెందాడు. ముమ్మిడివరం కుమ్మరివీధికి చెందిన పీతల వెంకటేశ్వరరావు(57) అస్వస్థతకు గురై మృతిచెందాడు. అతడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉత్సాహంగా పడవ పోటీలు

ఆత్రేయపురం, జనవరి 16: కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో కేరళ తరహాలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ ప్రకాష్, ఆప్కాస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ రాష్ట్రస్థాయి పడవ పోటీలు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా రూ.లక్ష, రూ.50వేలు, రూ.30వేలను విజేతలకు అందజేశారు. వైసీపీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పులి దిండిలో రూ.2 లక్షలతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆత్రేయపురంలో నాలుగు రోజుల పాటు పడవ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. బొబ్బర్లంక-ఆత్రేయపురం ప్రధాన పంట కాలువలో సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ నిర్వహణలో జరిగిన పడవ, ఈత పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో పాటు అధిక సంఖ్యలో ప్రజలు వీక్షించారు.

అమ్మకు గౌరవం

రామచంద్రపురం, జనవరి 16: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో మంగళవారం అమ్మకు గౌరవం పేరుతో చంటిపిల్లలకు పాలు ఇచ్చు గదిని ఏర్పాటు చేశారు.ద్రాక్షారామకు చెందిన శ్రీభీమేశ్వర దంత వైద్యశాల అధినేత డాక్టర్ బి.క్రాంతి కుమార్ సొంత నిధులతో ఈ గదిని సమకూర్చినట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు తెలిపారు. డాక్టర్ క్రాంతికుమార్ తల్లి ఈగదిని ప్రారంభించారు. రామచంద్రరం బస్టాండ్ నుంచి ప్రయాణించే చంటి పిల్లల తల్లులు ఈసౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

మకరజ్యోతి దర్శనంతో పులకించిన భక్త జనం



ఆలమూరు, జనవరి 16: మకర సంక్రాంతి పర్వదినాన ఆలమూరు అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మకరజ్యోతి దర్శనం వైభవంగా జరిగింది. మహిళలు, యువతులు అయ్యప్పనామస్మరణతో జ్యోతులతో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం జ్యోతి దర్శనం అనంతరం ఆలయం పక్కనే వున్న నాగులచెరువులో స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వరస్వామి, కొత్తపేట, మండపేట ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. రాత్రి మిరుమిట్లు గొలిపే బాణసంచాకాల్పులు ఆకట్టుకున్నాయి.

హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు పౌర సన్మానం

కె.గంగవరం, జనవరి 16: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బి.వి.ఎల్.ఎన్.చక్రవర్తి సంక్రాంతి పురస్కరించుకుని మంగళవారం స్వస్థలం తామరపల్లి గ్రామానికి విచ్చేశారు. వీరికి తామరపల్లి వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద గ్రామస్తులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోకల మంగ శ్రీనివాస్, యర్రపోతవరం సర్పంచ్ పిల్లి రాంబాబు, దంగేరు సర్పంచ్ కొప్పిశెట్టి వెంకట రమణ, ఎంపీటీసీలు పిల్లి దుర్గాప్రసాద్, కొప్పిశెట్టి లక్ష్మణ్, చిలుకూరి బాబూరావు, చిలుకూరి సత్యనారాయణ, మేడిశెట్టి పుల్లయ్య, త్రిమూర్తులు, శ్రీనివాస్, పట్నాల సత్యనారాయణ, జుత్తుక శ్యామ్‌ప్రసాద్, నాని, ఎస్సీ, బీసీ, పద్మశాలి సంఘాల అధ్యక్షులు, సభ్యులు న్యాయమూర్తి దంపతులను సన్మానించిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి గాడ్ జన్మదిన వేడుకలు

రాయవరం, జనవరి 16: వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ 88వ జన్మదిన వేడుకలు బుధవారం నుంచి 19వరకు నిర్వహించనున్నారు. 17న ఉదయం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభ అవుతాయని, ఉదయం 10గంటలకు వైఖానస పండితులతో సుదర్శన లక్ష్మీనరసింహహోమం, సాయంత్రం 6గంటల వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం తిరుత్తణి అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బి.రమ, పి.సత్యకనకదుర్గ పాల్గొన్నారు.

యానాంలో ఐపీఎస్ అధికారి పర్యటన

యానాం, జనవరి 16: యానాంలో పుదుచ్చేరి పోలీస్‌శాఖకు చెందిన సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఐపీఎస్ అధికారి నర్ర చైతన్య పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా యానాం వచ్చారు. యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద పోలీసుల నుంచి గౌరవ వందన స్వీకరించారు. ఆయనకు యానాం సీఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, పువ్వల వీరభద్రస్వామి శాలువాలతో సత్కరించారు.

పరిహారం కోసం ఓఎన్జీసీ అధికారులతో సమావేశం

యానాం, జనవరి 16: యానాం నియోజవర్గంలో మత్స్యకారులకు ఇవ్వాల్సిన పరిహారానికి సంబంధించి ఓఎన్జీసీ అధికారులతో పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమావేశమయ్యారు. పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో మల్లాడి మంగళవారం ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్ కుమార్, తదితర అధికారులను కలిశారు. ఇటీవల పుదుచ్చేరి ప్రభుత్వం తుది జాబితాను ఓఎన్జీసీకి అందజేసింది. త్వరగా పరిహారం ఇవ్వాలని తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో యానాం మత్స్య శాఖ సహాయ సంచాలకులు దడాల గొంతయ్య పాల్గొన్నారు.

తరతరాల సంప్రదాయం.. శూలధారుల ఊరేగింపు



అమలాపురం రూరల్, జనవరి 16: తరతరాల నాటి సంప్రదాయం. భవిష్యత్తుతరాల వారుఈసంప్రదాయాన్ని కొనసాగించాలని కోరుకుంటూ నేటి తరానికి చెందిన యువకులు, బాలలు భక్తిప్రపత్తులతో జరిపే వీరభద్రుని సంబ రంలో భాగంగా మంగళవారం అమలాపురం మండలం వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన కరికాల భక్తులు కనుమ రోజున వీరభద్రుని సంబరాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కంఠంపైన, బుగ్గలపైన అలుగులు (శూలాలు, కత్తులు) ధరించి ఉదయం వీరభద్రుని ఆలయం వద్ద నుంచి యువకులను, చిన్నారులను ట్రాక్టరుపై ఉంచి గ్రామమంతా ఊరేగించారు.

దంగేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు మృతి

కె.గంగవరం, జనవరి 16: దంగేరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు రావిపాటి వివిఎస్ఎస్ఆర్ సత్యనారాయణ(85) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన రాయవరం మునుసూబుకు అత్యంత సన్నిహితుడు. గోదావరి నది ఒడ్డున అంత్యక్రియలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, దంగేరు మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్ చౌదరి, దంగేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు రావిపాటి రవీంద్రనాద్‌చౌదరి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మామిడికుదురు, జనవరి 15: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మానేపల్లికి చెందిన మొల్లేటి చంద్రశేఖర్(23) మృతిచెందాడని నగరం హెచ్‌సీ బి.కొండబాబు తెలిపారు. ఆదివారం రాత్రి రాజోలు మండలం పొన్నమండలో సోదరి ఇంటికి వెళ్లి బైకుపై వస్తుండగా మామిడికుదురు షిర్డిసాయిబాబా ఆలయం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి గాయాలపాలయ్యాడు. అమలాపురంలోని ప్రైవేటుఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్టు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

కాట్రేనికోన, జనవరి 16: కందికుప్ప హైస్కూల్ 1994-95 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థి దశ అల్లరిని గుర్తుచేసుకుని పరవశులయ్యారు. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని, ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరూ స్పందించాలని నిర్ణయిం తీసుకున్నారు. కార్యక్రమంలో ఏడిద అనీల్‌కుమార్, నాతి నాగేశ్వరరావు, సంసాని ప్రసాద్, గుదే దుర్గాప్రసాద్, నాతి రమేష్, మల్లాడి కాసులయ్య, చోడవరపు శ్రీనివాస్, కూరాకుల రామకృష్ణ, నిమ్మితి ధనబాబు, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, విత్తనాల రాంబాబు, మోకా రాంబాబు, తోట సుబ్బారావు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి లూథరన్ హైస్కూలులో 1900-91పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, సువర్ణరత్నం, వై.రంజిత్‌కుమార్, బెల్లంకొండ నాగేశ్వరరావు, కాట్రు ప్రవీణ్ పాల్గొన్నారు.

మామిడికుదురు: మగటపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 1997-1998లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్కూలు ఆవరణలో కలుసుకున్నారు. క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకుని ఉత్సాహంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాలతో గడిపారు. షేక్ సుభానీ, కాండ్రేగుల శ్రీను, బుంగ శ్రీను, నామన సురేష్, వలవల శ్రీబాలాజీ, బొలుసు ప్రసాద్ పాల్గొన్నారు.